# తీర్థయాత్ర.. మృత్యువాత

కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా..
జబల్‌పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
ఏడుగురు మృతి, ఇద్దరికి గాయాలు
నగరంలో విషాదఛాయలు
కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు



ఉప్పల్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): మహా కుంభమేళాకు వెళ్లిన నగర వాసుల వాహనం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. మినీ బస్సులో రెండు రోజుల క్రితం నాచారం నుంచి బంధువులు, స్నేహితులు కలిసి 9 మంది వరకు వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. యూపీ ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాలో పుణ్య స్నానాలు చేసుకొని ఇంటికి తిరిగి వస్తుండగా జబల్‌పూర్ వద్ద సిమెంట్ లారీ, మినీ బస్సు ఢీకొనగా ఏడుగురు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారని టీవీల్లో వార్తలు రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. నాచారం, కార్తికేయనగర్, తార్నాక, మారుతీనగర్‌కు చెందిన కాలనీ వాసులు మృతి చెందినట్లు తెలిసింది. నాచారానికి చెందిన శశికాంత్( 38), కార్తికేయ నగర్ కు చెందిన సంతోష్ కుమార్ (48) మరో ఇద్దరు దగ్గరి బంధువులు, స్నేహితులైన మల్లారెడ్డి, వెంకటప్రసాద్, రవికుమార్, నవీన్‌చారి, ఆనంద్, శ్రీరామ్ బాలకిషన్ స్థానికుడైన డ్రైవర్ రాజుతో కలిసి రెండు రోజుల క్రితం కుంభమేళాకు వెళ్లారు. శశికాంత్ ఉదయమే అమ్మతో మాట్లాడి తిరిగి వస్తున్నట్టు తెలిపాడు. అంతలోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. సంతోష్ కుమార్ గోల్డ్ షాప్ నిర్వహిస్తున్నాడు. కొంత కాలం క్రితం తన భార్య చనిపోయింది. ఆ విషాదం నుంచి కోలుకోలేక ముందే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కార్తికేయ నగర్ కాలనీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న మల్లారెడ్డి పాల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. మల్లారెడ్డి చనిపోవడంతో స్నేహితులు, బంధువులు విచారం వ్యక్తం చేశారు. నాచారం ఎర్రగుంటకు చెందిన మినీ బస్సు డ్రైవర్ రాజు చనిపోవడంతో విషాదం నెలకొంది. తార్నాక గోకుల్ నగర్‌కు చెందిన వెంకట ప్రసాద్ (48) బ్యాంక్ ఆఫ్ బరోడా లో పనిచేస్తున్నారు. రవికుమార్ మెడికల్ షాప్ నిర్వాహకుడు చనిపోయిన వారిలో ఉన్నారు. నవీన్, ఆనంద్ కుమార్, సంతోష్,శశికాంత్ దగ్గర బంధువులుగా పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి బాధిత కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

### మృతదేహాలను తెప్పించేందుకు ఏర్పాట్లు..

మేడ్చల్, ఫిబ్రవరి11(నమస్తే తెలంగాణ): మహా కుంభమేళా నుంచి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి జిల్లా యంత్రాంగంతో చర్చించారు. ప్రమాదంలో మేడ్చల్ జిల్లాకు చెందిన ఉప్పల్ నియోజకవర్గం నాచారం, తార్నాక కు చెందిన ఏడుగురు మృతి చెందగా ఇద్దరికీ త్రీవ గాయాల పాలవడం బాధాకరమన్నారు. మృతి చెందిన వారిలో బౌరంపేట్ సంతోష్‌కుమార్, రాంపల్లి రవికుమార్(నాచారం), శశికాంత్, రాజు (నాచారం), మల్లారెడ్డి(నాచారం), ప్రసాద్(తార్నాక) ఆనంద్‌కుమార్(దిల్‌షుక్‌నగర్) గాయపడిన వారిలో శ్రీరామ్ బాలకృష్ణ(నాచారం), సుంకజ నవీన్(సరూర్‌నగర్)లు ఉన్నట్లు మహేందర్‌రెడ్డి తెలిపారు.

## శంషాబాద్‌కు పుష్పక్ బస్సులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 ( నమస్తే తెలంగాణ ) : జేబీఎస్ నుంచి శంషాబాద్, శంషాబాద్-జేబీఎస్‌కు పుష్పక్ బస్సు సేవలు బుధవారం నుంచి అందుబాటులో ఉంటాయని గ్రేటర్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాత్రి 12:55 నుంచి రాత్రి 11:55 వరకు బస్సులు నడుస్తాయని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యవంతమైన ప్రయాణం కోసం పుష్పక్ బస్సులను ప్రవేశపెట్టినట్టు పేర్కొన్నారు.

## నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

సుల్తాన్ బజార్,ఫిబ్రవరి 11 : అర్హతలేని నకిలీ వైద్యులను రాజకీయ ప్రయోజనాల కోసం ప్రోత్సహిస్తే ఆరోగ్య సంక్షోభానికి దారితీస్తుందని తక్షణమే మానుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథరెడ్డి, కార్యదర్శి డాక్టర్ అశోక్, యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. మంగళవారం కోటిలోని ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నకిలీ వైద్యుల ప్రాక్టీసును తక్షణమే అడ్డుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. స్టిరాయిడ్స్, మందుల మోతాదులను వయసుతో సంబంధం లేకుండా పిల్లలకు, పెద్దలకు ఇస్తూ వారి ప్రాణాలను బలిగొంటున్నారన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ యొక్క 34వ సెక్షన్ ప్రకారం అర్హతలేని నకిలీ వైద్యుల ప్రాక్టీసును వెంటనే నిషేధించాలని, సెక్షన్ 54 ప్రకారం వారి ని నేరస్తులుగా పరిగణించి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## 9న జువెల్లరీ సేల్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): మార్చి 9వ తేదీన అతిపెద్ద జువెల్లరీ సేల్ ఆఫర్‌ను అందిస్తున్నట్లు జోయాలుక్కాస్ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. వరల్డ్ జువెల్లరీ బ్రాండ్ జోయాలుక్కాస్ మజూరీ చార్జీలపై ఫ్లాట్ 50శాతం తగ్గింపుతో ఆశ్చర్యపరుస్తున్నట్లు పేర్కొంది. కొనుగోలుదారులు తమకు దగ్గరలోని ఆధునిక జోయాలుక్కాస్ షోరూంను సందర్శించి, ఇంతకు ముందు లేని విధంగా షాపింగ్ అనుభవాన్ని ఆనందించవచ్చని చెప్పింది. ఈ ఆఫర్‌న అన్ని జోయాలుక్కాస్ షోరూంలలో ఉంటుందని ప్రకటించింది. ఈ ప్రత్యేకమైన ఆఫర్‌కి అదనంగా కస్టమర్‌లు జీవితకాలం ఉచిత నిర్వహణతో పాటు ఏడాది పాటు ఉచిత బీమా, బై బ్యాక్ బీమాను జోయాలుక్కాస్ ప్రతి కొనుగోలులో పొందే విధంగా అవకాశాన్ని కల్పిస్తుంది.

## ఇసుక లారీలపై అక్రమ కేసులు



ఇసుక లారీ సంఘాల జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

మన్సూరాబాద్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో ఇసుక లారీలపై అక్రమ కేసులు పెట్టి యజమానులను తీవ్రంగా వేధింపులకు గురి చేస్తున్నారని రాష్ట్ర ఇసుక లారీ సంఘాల జేఏసీ నాయకులు ఆరోపించారు. మంగళవారం మనసురాబాద్ డివిజన్ పరిధి కామినేని చౌరస్తా సమీపంలోని ఎస్కే గార్డెన్‌లో రాష్ట్ర నాయకులు వెంకన్న ఆధ్వర్యంలో ఇసుక లారీ యజమానులు సమావేశాన్ని నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ అధిక లోడు పేరుతో ఆర్టీఏ, మైనింగ్, విజిలెన్స్ అధికారులు ఇసుక లారీలకు అడ్డగోలుగా లక్షల్లో చలాన్లు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి తదితర జిల్లాల్లో అధికారుల వేధింపులు భరించలేక పలువురు లారీ యజమానులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దాడులను నిలిపివేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జేఏసీ నాయకులు యాదయ్య గౌడ్. రాజు గౌడ్, సలీం, జంగయ్య, జగదీశ్ యాదవ్, అంజయ్య, లింగయ్య, జంగయ్య, నరసింహ, నరసింహ, శ్రీను, శ్రీశైలం, రమేశ్ పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యం

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
పూడూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్, ఫిబ్రవరి 11: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మేడ్చల్ ప్రాంత రైతులకు ఇది గొప్ప అవకాశమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరులోని రైతు వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.4.70 కోట్లతో ఏర్పాటు చేసిన కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదం, మల్కాజి గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషితో పూడూరులో ఫుడ్ ప్రాసింగ్ యూనిట్ ఏర్పాటైందని తెలిపారు. రైతును రాజు చేయడమే కేసీఆర్ ఆలోచన అన్నారు. ఆయన చూపిన దారిలో రాజశేఖర్ రెడ్డి, తాను కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ యూనిట్ ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేశామని పేర్కొన్నారు. రైతులు పండ్లు, కూరగాయలు పండిస్తే ఆర్థికంగా లాభపడవచ్చన్నారు. అధిక మొత్తంలో పంట ఉత్పత్తి జరిగి, ధర తక్కువగా ఉన్నప్పుడు టమాట, ఆలు తదితర కూరగాయాలను ప్రాసెసింగ్ చేసి, జ్యూస్, చిప్స్ గా మార్చడం ద్వారా రైతు ఆర్థికంగా నష్టం పోకుండా లాభాలు పొందవచ్చని చెప్పారు. తెలంగాణ ఎక్కడా కూడా సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రాసెసింగ్ యూనిట్ లేదని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ శ్యామ్‌లాల్, మాజీ సర్పంచులు బాబు యాదవ్, మహేందర్, మోహన్ రెడ్డి, మేడ్చల్ పీఏసీఎస్ చైర్మన్ రణదీప్ రెడ్డి, డైరెక్టర్లు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు శశికుమార్, శ్రీకాంత్, కోల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులను జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలి



బండ్లగూడ,ఫిబ్రవరి 11: తెలంగాణ పోలీస్ అకాడమీలో సివిల్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌లు,అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్లు17వ బ్యాచ్, ఆర్మ్‌డ్ రిజర్వ్ అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ల నుంచి రిజర్వ్‌సబ్ ఇన్‌స్పెక్టర్లు10వ బ్యాచ్‌కి ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభోత్సవం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి ఆర్థిక ప్రణాళిక మొక్క ప్రాముఖ్యతను వివరించారు. పదవీ విరమణ తర్వాత వచ్చే డబ్బులు మంచి రాబడి,రిస్క్ లేని పథకాల్లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాషబిష్ట్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు,బాధితుల పై పోలీసులు సానుభూతితో వ్యవరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ మురళీధర్,డిప్యూటీ డైరెక్టర్లు అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



## 18 నుంచి హైలైఫ్ బ్రైడ్స్ ఫ్యాషన్ షో

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 ( నమస్తే తెలంగాణ ) : హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో హైలైఫ్ బ్రైడ్స్ ఫ్యాషన్ షో ఈనెల 18, 19, 20న జరగనుందని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ మోడల్స్ కుశిత కల్లపు, కామాక్షి భాస్కర్ ఆవిష్కరించారు. వెడ్డింగ్ జువెల్లరీ, పెండ్లి దుస్తులు, మేకప్‌లో వైవిధ్యాన్ని చాటుతూ ఈ ఈవెంట్ జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

## కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటై పద్నాలుగు నెలలు గడుస్తున్న స్థానిక ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం కాలయాపన చేస్తూ, పరీక్షల సమయంలో ఎన్నికలు నిర్వహిస్తామనడం విడ్డూరమని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ మాజీ సర్పంచ్‌లతో కలిసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పలు అంశాలపై ఎన్నికల సంఘం సంయుక్త కార్యదర్శి జయసింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. పరీక్షలు ముగిసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో గ్రామపంచాయతీలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి, బిల్లులు అందక సర్పంచ్‌లు ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి, ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రేవంత్ సర్కార్ సర్పంచులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి, ఎస్సీ వర్గీకరణలో తగిన న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం నేతలు బాలరాజ్‌ముదిరాజ్,బొజ్జ రామేశ్వర్ రెడ్డి, ప్రకాశ్, పెద్దపల్లి రమేశ్, చంద్రశేఖర్, ప్రఫుల్ తదితరులు పాల్గొన్నారు.

## మురుగు సమస్యకు పరిష్కారం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): జలమండలి ఓ అండ్‌ఎం డివిజన్ నంబర్-4 రెడ్‌హిల్స్ పరిధిలోని లక్డీకాపూల్‌లో సీవరేజీ ఓవర్ ఫ్లోను అధికారులు అరికట్టారు. జెట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి సిల్ట్‌ను బయటకు తీసి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఫలితంగా సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యకు పరిష్కారం లభించింది. మంగళవారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా డీ-సిల్టింగ్ పనులు నిర్వహించి సిల్ట్ అంతా తొలగించారు. మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

# యూజీసీ గైడ్‌లైన్స్ వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ : యూజీసీ చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థ అని, కేంద్రం తన సొంత ఎజెండాను వర్సిటీలలో అమలు పరిచేందుకు కుట్రలు చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్‌దేవాంగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్ సిరంగరాజ్ ఆరోపించారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ యూజీసీ నూతన మార్గదర్శకాలు రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్‌ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విరాజ్‌దేవాంగ్, దినేశ్ సిరంగరాజ్, జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పూర్తిగా గవర్నర్ చేతిలో వీసీల నియామకాలు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. యూజీసీ 2025 సవరించిన నియమాలలో వీసీల ఎంపికలో గవర్నర్లకు ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నాయని, ఇది ప్రమాదకరమని అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు నరేశ్, ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, నాయకులు ఆరెకంటి భగత్,ఉప్పల ఉదయ్, అశ్వన్, ప్రసాద్, దిలీప్, గోపగోని ఉదయ్ సలీం, పేర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

### వర్సిటీలపై కేంద్రం కుట్రలు

హిమాయత్ నగర్, ఫిబ్రవరి11: దేశంలోని యూనివర్సిటీల స్వయం ప్రతి పత్తిని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ విమర్శించారు. మంగళవారం హైదర్ గూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసేందుకు కేంద్ర ప్రయత్నిస్తుందన్నారు. యూజీసీ చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థ అని కేంద్రం తన సొంత ఎజెండాను యూనివర్సిటీలో అమలు చేసినందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిందన్నారు. సంఘం నాయకులు సుధాకర్,జానీ పాల్గొన్నారు.

## ఎంసీసీ చర్యలతో నష్టపోయిన విద్యార్థులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 11 : మెడికల్ కౌన్సిల్ కమిటీ చర్యలతో దేశవ్యాప్తంగా విద్యార్థులు నీట్‌లో నష్టపోయారని గాంధీ మెడికల్ కాలేజ్ విద్యార్థి డాక్టర్ వెంకటేశ్ కుమార్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది దేశ వ్యాప్తంగా కౌన్సెలింగ్ అస్తవ్యస్తంగా మారిందన్నారు. రౌండ్ 1, 2, 3 పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా, మధ్యప్రదేశ్ రాష్ట్రంలో రెండో రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించకుండానే మూడో రౌండ్ నిర్వహించారని, ఫలితంగా అక్కడ విద్యార్థులు ఆ సీట్ల పొందడం వల్ల, దేశ వ్యాప్తంగా మూడో రౌండ్ కౌన్సెలింగ్ కోసం ఎదురు చూసే విద్యార్థులు నష్టపోయారన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సైతం ఈ సమస్యను పరిష్కరించాలంటూ కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి లేఖ రాసిన స్పందించలేదన్నారు.

# బీసీలు ఉద్యమాలకు సిద్ధం కావాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 11: బీసీలను అణగదొక్కడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కులగణనను తప్పుల తడకగా చేసిందని, డెడికేటెడ్ కమిషన్ రిపోర్టు కూడా అలాగే ఉందని.. వెనుకబడిన వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని ఇక ఉద్యమాలకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లలోనే సమగ్ర కులగణన చేసి బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి బీసీల ఓట్లతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందన్నారు. ఏడాది గడిచినా ఎలాంటి చలనం లేకపోవడంతో నిరసన కార్యక్రమాలను నిర్వహించి కోర్టును ఆశ్రయిస్తే దిగి వచ్చిన ప్రభుత్వం మొక్కుబడిగా కులగణన చేపట్టిందన్నారు. సమగ్ర కులగణనలో 60 శాతం ఉన్న బీసీలను 46 శాతం మాత్రమే ఉన్నట్లు తప్పుడు రిపోర్టు ఇవ్వడంతో పాటు హిందూ, ముస్లింలని బీసీలను విభజించిందని, దీనిపై రెండు రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో బీసీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో బీసీల సంఘాలు చర్చలు నిర్వహించగా, 48 గంటల్లో సరిచేయాలని కోరామని, అందుకు సరేనని హామీ ఇచ్చి దోఖా చేశారన్నారు. ప్రభుత్వం చేసిన సమగ్ర కులగణనతో పాటు డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును తిరస్కరిస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఉద్యమకార్యచరణ ప్రకటిస్తున్నామన్నారు. బీసీలందరూ ఎక్కడికక్కడ ఆందోళనలు, ధర్నాలు చేయాలని చేయాలని పిలుపునిచ్చారు. బీసీలపై ప్రభుత్వ వివక్షతకు నిరసగా మార్చి 9న హైదరాబాద్ వేలాది మంది కులగణన రణభేరి పేరుతో చలో హైదరాబాద్ చేపడుతున్నామన్నారు. బీసీలను దగా చేసిన కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కే వరకు నిద్రపోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కుల్కచర్ల శ్రీనివాస్, రాజేందర్, మణిమంజరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌తో ఒప్పందం



ఒప్పందంలో పాల్గొన్న ప్రతినిధులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 11: విమానయాన పరిశ్రమలోని కీలక రంగాల్లో ప్రత్యేక శిక్షణ వృత్తి విద్యను పెరుగుతున్న డిమాండ్‌ను పరిష్కరించే లక్ష్యంతో జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ అండ్ జీఎంఆర్ ఏరో అకాడమీతో రాయల్ మెల్‌బోర్న్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయని జీఎంఆర్ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ భాగస్వామ్యం విమానయాన పరిశ్రమ యొక్క అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి రూపొందించిన అత్యాధునిక విద్యా పరిష్కారాలను అందించడానికి మూడు సంస్థల ఉమ్మడి నైపుణ్యాన్ని ఉపయోగిస్తుందని జీఎంఆర్ ఏరో అకాడమీ, జీఎంఆర్ స్కూల్‌ఆఫ్ ఏవియేషన్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ తెలిపారు.

## ఎన్పీటీఈఎల్‌లో మల్లారెడ్డి అధ్యాపకుల ప్రతిభ



చైతన్య రెడ్డిని అభినందిస్తున్న మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్, ఫిబ్రవరి 11: ఐఐటీ మద్రాసులో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక అంతర్జాల విద్యా బోధన కార్యక్రమం ఎన్పీటీఈఎల్ లో మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్ అధ్యాపకులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఏ గ్రేడ్ సాధించారు. మల్లారెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి ఈ సందర్భంగా అధ్యాపకులను అభినందించారు. జూలై - డిసెంబర్ 2024 సెమిస్టర్ లో కళాశాల కు డిసిప్లిన్ స్టార్, సూపర్ స్టార్, డొమైన్ స్టార్ వంటి వివిధ రకాల 17 ఉత్తమ ప్రతిభా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు రావడం హర్షణీయమన్నారు. ఈసీఈ విభాగానికి చెందిన శ్రీ చైతన్య రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ డీన్ డాక్టర్ సునీల్, హెచ్‌వోడీ డాక్టర్ మణిగండ దేవరాజన్, కళాశాల ఎన్పీటీఈఎల్ సమన్వయకర్త డాక్టర్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

## రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నాం



సిటీబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రంగరాజన్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక సమరసత సంఘం తెలంగాణ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం రంగరాజన్‌ను కలిసి భౌతిక దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ కో కన్వీనర్ వేణుగోపాల్, సంచార జాతుల రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి, న్యాయవాదులు శ్రీకృష్ణ కన్నన్, రాజేశ్ బాబు, హర్షవర్ధన్, శివాజీ రావు పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



బ్రాంచ్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): భారతీయ బీమా సంస్థలో క్లాస్ త్రీ, ఫోర్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని హైదరాబాద్ డివిజన్‌లోని సర్కిల్-7 బ్రాంచ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. అంతకుముందు బ్రాంచ్ మేనేజర్ రవికుమార్‌కు వినతి పత్రం అందేశారు. ఉద్యోగాల భర్తీతో పాటు కార్మికుల హక్కులను కొనసాగించేందుకు ఏఐఐఈఏ సంఘానికి గుర్తింపునివ్వాలని కోరారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించకుంటే 20న దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేశ్ గౌడ్, బాలకృష్ణ, రమణ, సత్యనారాయణ, చక్రధర్, సాల్మన్, శ్రీకాంత్, శ్రావ్య, సుచిత, జయ పాల్గొన్నారు.

## భారత ఇంజినీర్లకు ప్రత్యేక గౌరవం



సదస్సులో పాల్గొన్న ఇంజినీరింగ్ ప్రతినిధులు

సిటబ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంజినీర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని సింగరేణి మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ బాలకోటిరెడ్డి అన్నారు. 'జాతీయ ఇంధన భద్రత-అరుదైన ఖనిజ సంపద అన్వేషణ' పై గచ్చిబౌలి ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు సభలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. భారత ఇంజినీర్లకు నైజీరియా, ఘనా, యూరోపియన్ దేశాల్లో అత్యంత గౌరవం ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్‌పర్సన్ బాలకృష్ణన్ నాయర్, ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్‌రావు, మైనింగ్ విభాగం హెడ్ కేజే అమర్‌నాథ్, పలు యూనివర్సిటీల ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



## విశ్వ గురువుగా ప్రభుపాదులు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇస్కాన్, హరే కృష్ణ వ్యవస్థాపకుడు ఏసీ భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులను అఖిల భారత అఖార పరిషత్ 'విశ్వగురు' బిరుదుతో సత్కరించింది. మహాకుంభమేళాలో నిత్యానంద త్రయోదశి సందర్భంగా సోమవారం పవిత్ర మంత్రోచ్ఛరణలతో పుష్పాభిషేకంతో బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బెంగళూరు ఇస్కాన్ అధ్యక్షుడు మధు పండిట్ దాసు మాట్లాడుతూ.. మహా కుంభమేళా దివ్య వాతావరణంలో ఆచార్య శ్రీల ప్రభుపాదులకు విశ్వ గురు బిరుదును అందించడం మొత్తం ఇస్కాన్ సమాజానికి ఆనందాన్ని కలిగిస్తున్నదని అన్నారు. సనాతన ధర్మం, ప్రాచీన జ్ఞానం, భారతీయ సంస్కృతి, జీవన విధానాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. శ్రీకృష్ణుడి సందేశాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి అని కీర్తించారు. శ్రీపాదులను సత్కరించినందుకు అఖిల భారత అఖార పరిషత్, మహంత్ రవీంద్ర పురిజీ మహారాజ్, ఆచార్య మహామండలేశ్వర్ స్వామి కైలాసానంద్ గిరి జీ కి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నిరంజని అఖార ఆచార్య మహామండలేశ్వర్, ఆచార్య మహామండలేశ్వర్ అవధూత్ అవాహన్, ఆచార్య మహామండలేశ్వర్ అవధూత్ అరుణ్ గిరి జీ మహారాజ్‌తో పాటు సీనియర్ సాధువులు తదితరులు పాల్గొన్నారు.